
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
సోమవారం 2 సెప్టెంబరు 2024





శంకరపట్నం మండలం అర్కండ్ల లో లెవల్ బ్రిడ్జిపై ఉధృతంగా ప్రవహిస్తున్న వర్షపు నీరు

- జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- నీటమునిగిన పంట పొలాలు
- అలుగుపారుతున్న చెరువులు, కుంటలు
- నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- మరో 24 గంటలపాటు భారీ వర్షసూచన
- ఎల్లో అలర్ట్ జారీ చేసిన వాతావరణశాఖ
- కూలిన పాత ఇళ్లు... ఇళ్లలోకి చేరిన వరద నీరు
- అంబాలాపూర్ ఊరచెరువుకు గండి

వాన..వరద

కరీంనగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లావ్యాప్తంగా రెండు రోజుల నుంచి ఎడతెరపిలేకుండా వర్షం కురుస్తోంది. వచ్చే 24 గంటల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయంటూ వాతావరణశాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వం సోమవారం సెలవు ప్రకటించింది. లోయర్ మానేరు డ్యాంతోపాటు చెరువులు, కుంటలకు జలకళ సంతరించుకుంది. ఎల్ఎండీకి మిడ్‌మానేరు, మోయతుమ్మెద వాగునుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటలు, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. శంకరపట్నం మండలం అంబాలాపూర్ గ్రామంలో ఊర చెరువుకు గండి పడడంతో ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. జిల్లా కేంద్రంతో పాటు పట్టణాలు, మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లో వరద నీరు రోడ్లపైకి వచ్చి చేరాయి. కొన్ని చోట్ల ఇళ్లలోకి నీరు రావడంతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు. చెట్లు, చెట్ల కొమ్మలకు విరిగి పడటంతోపాటు రోడ్లపైకి భారీగా వరదనీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. పలుచోట్ల శిథిలావస్థకు చేరిన పాత భవనాలు, ఇళ్లు, పూరి గుడిసెలు కూలిపోయాయి.


జలమయమైన నగరంలోని ప్రధాన రహదారి


పోలంపల్లి, మొగిళిపాలెం గ్రామాల మధ్యలో వరద నీరు


జలమయమైన కరీంనగర్ టూటౌన్ పక్క వీధి

● రోడ్లపైకి వరద నీరు

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్, పోలీస్ హెడ్‌క్వార్టర్స్ కార్యాలయం ఎదుట, కరీంనగర్-హైదరాబాద్ హైవేలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద, రాంనగర్, మంకమ్మతోట, ముకరంపుర, శర్మనగర్, అల్కాపురికాలనీ, ఆర్టీసీ వర్క్‌షాపు, మంచిర్యాల చౌరస్తా, శర్మనగర్, ఆటోనగర్, లక్ష్మినగర్, హన్మాన్‌నగర్, కట్టరాంపూర్, సాలంపుర, శ్రీహరినగర్, పద్మనగర్, దుర్గా నగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపైకి భారీగా వరద నీరు చేరింది. ఆయా ప్రాంతాలవాసులు ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని హౌసింగ్ బోర్డుకాలనీలోకి భారీగా వరద నీరు చేరి ఇళ్లలోకి నీరు రావడంతో కాలనీవాసులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మున్సిపల్ సిబ్బంది నీటిని మళ్లించే చర్యలు చేపట్టారు. కరీంనగర్ రూరల్ మండలంలోని తీగలగుట్టపల్లి రైల్వే బ్రిడ్జి సమీపంతోపాటు పలు కాలనీలు వరద నీటిలో మునిగాయి. తిమ్మాపూర్ మండలం రేకొండలో దున్న పోతుల పోచయ్య అనే వ్యక్తి ఇల్లు కూలింది.

చిగురుమామిడి మండలంలోని ఒగులాపూర్ గ్రామంలో అనేక ఇళ్లలోకి వరద నీరు వచ్చి చేరడంతో వస్తువులు నీటి మునిగాయని బాధితులు వాపోయారు. మానకొండూర్ మండలంలోని పలు గ్రామాలతోపాటు, చిగురుమిడి మండలం కొండాపూర్ గ్రామంలో వరి పొలాలు నీట మునగడంతో వీణవంక మండలంలోని వీణవంక, ఎల్బాక, మామిడాలపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లోని చెరువులు, కుంటలు అలుగుపారాయి. సైదాపూర్ మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద రోడ్డుపై భారీగా వర్షపునీరు నిలవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. శంకరపట్నం మండల కేంద్రంలోని అంబాలాపూర్ ఊర చెరువుకు గండి పడింది. అరకండ్లలో లోలెవల్ బ్రిడ్జిపై నుంచి ఉధృతంగా వరద నీరు ప్రవహిం చడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సైదాపూర్ మండలంలోని నాల్ చెరువు మత్తడి దూకింది. చొప్పందండి మండలంలో పంది వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఆర్నకొండ- రాగంపేట గ్రా మాల మధ్య రాక పోకలు నిలిచిపోయాయి. రామడుగు మండలంలోని గుండి ఊరచెరువు మత్తడి దూకడంతో గుండి-లక్ష్మీపూర్ రహదారి మధ్యలో దెబ్బతినడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గంగాధర మండలంలో నారాయణపూర్ చెరువు అలుగుపారడంతో లక్ష్మీదేవిపల్లి బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో గంగాధర, పెగడ పల్లి మండలాల రాకపోకలు నిలిచి పోయాయి.

● జిల్లాలో దంచికొట్టిన వాన

జిల్లాలో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు 110.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా సైదాపూర్ మండలంలో 132.6 మి.మీ వర్షం కురిసింది. జిల్లాలో ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటలవరకు భారీ వర్షం పడింది. ఎనిమిది గంటల వ్యవధిలో సగటు 41.4 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చిగురుమామిడి మండలంలో 93.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చొప్పదండి మండలం వెదురుగట్టులో 91.8, తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్, మానకొండూర్ మండలం ఈదుగట్టపల్లిలో 79, ఇందుర్తిలో 71.3, రామడుగు మండలం గుండిలో 57, సైదాపూర్ మండలం వెంకపల్లిలో 56.3, చొప్పదండి మండలం ఆర్నకొండలో 54.8, గంగాధర మండల కేంద్రంలో 50, కొత్తపల్లి మండలం ఆసీఫ్‌నగర్‌లో 49.5, జమ్మికుంట మండలంలో 48.0, గన్నేరువరం మండలం కాసీంపేటలో 46.8, హుజురాబాద్ మండలం బోర్నపల్లిలో 45.5, కరీంనగర్‌లో 31.8, శంకరపట్నం మండలం కొత్తగట్టులో 30.5, కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్‌లో 24., ఇల్లందకుంట మండలం మల్యాలలో 11.3, వీణవంక మండలంలో 3.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

ఎల్ఎండీని పరిశీలించిన మంత్రి పొన్నం

తిమ్మాపూర్: రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. దిగువ మానేరు జలాశయం పరిస్థితి గురించి నీటిపారుదల అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఎండీకి భారీగా ఇన్‌ఫ్లో వస్తోందన్నారు.. అధికారులందరూ క్షేత్రస్థాయిలో పని చేస్తున్నారని తెలిపారు. కాళేశ్వరంలో టెక్నికల్ కమిటీ ఇచ్చిన రిపోర్ట్ ప్రకారమే నీటి నిల్వ కొనసాగుతోందని, ఎల్లంపల్లి నుంచి ప్రతీ చుక్క నీటిని ఉపయోగించుకుంటామన్నారు. ఎస్సారెస్పీలో ప్రస్తుతం 64 టీఎంసీల నీరు ఉందని, పూర్తిస్థాయిలో నిండగానే వరద కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తామని తెలిపారు. రోడ్లపై వరద వెళ్తుంటే వాహనాలను అనుమతించవద్దన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ భాజపాయ్, ఇరిగేషన్ ఎస్ఈ పి రమేష్, ఈఈ నాగభూషణం, ఏఈ వంశీధర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దు : మంత్రి 'పొన్నం'

జిల్లాలో భారీ వర్షాలు వర్షాలు కురుస్తున్నందున ప్రజలు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారన్నారు. ప్రజల రక్షణ కోసం అధికార యంత్రాంగం నిరంతరం శ్రమిస్తోందని, ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ప్రజలెవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని ఆయన విజ్ఞప్తిచేశారు. భారీ వర్షాలకు సంబంధించి బాధితుల సహాయం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, టోల్ ఫ్రీ నంబర్ 8782997247తోపాటు వాట్సాప్ నంబర్ 8125184683లో సంప్రదించవచ్చన్నారు. 24 గంటలు సిబ్బంది అందు బాటులో ఉంటారని మంత్రి పొన్నం తెలిపారు.

నారాయణపూర్ ముంపునకు శాశ్వత పరిష్కారం

గంగాధర: నారాయణపూర్ రిజర్వాయర్ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు బీసీ సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. భారీ వర్షాలు కురుస్తున్నందున నారాయణపూర్ రిజర్వాయర్‌ను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామస్థులు తమ సమస్యలు మంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శాశ్వత పరిష్కారానికి గ్రామస్థులు సహకరించాలని, భూ సేకరణ చేసి పునరావాసం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రి వెంట ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్య నారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి, ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.


మానకొండూర్ మండలం దేవంపల్లిలో మత్తడి పడుతున్న ఊరచెరువు


తిమ్మాపూర్-పోరండ్ల మధ్యలో రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు


గన్నేరువరం పెద్ద చెరువు వద్ద కల్వర్టుపై ప్రవహిస్తున్న వరద నీరు


చొప్పదండి మండలం రెవెల్లి చెరువు మత్తడి పడుతున్న నీరు


గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరద నీరు


ఉధృతంగా ప్రవహిస్తున్న మోయతుమ్మెద వాగు


కరీంనగర్‌లో ఆర్టీసీ జోనల్ వర్క్‌షాపు వద్ద జలమయమైన ప్రధాన రహదారి


ఎక్లాస్‌పూర్-సోమారం మధ్య సోమారం వాగు ఉధృతి

విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

గణేష్‌నగర్, సెప్టెంబరు 1: ఎడతెరిపి లేని వర్షాల నేపథ్యంలో విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. ఆదివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి నష్టాలు లేకుండా, ఇబ్బందులు లేకుండా చూడాలన్నా రు. సబ్‌స్టేషన్లు నీట మునిగితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులపై సీఈలు, ఎస్ఈలు, డీఈలతో మాట్లాడారు. విద్యుత్ అంతరాయం కలిగిన చోట పునరుద్ధరణకు కలెక్టర్, పోలీస్, రెవెన్యూ జిల్లా శాఖల సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. వరదల వల్ల నీట మునిగిన సబ్‌స్టేషన్లు, పిడుగులు పడి దెబ్బతిన్న చోట మరమ్మతులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయాల నుంచి విద్యుత్ సరఫరా చేయాలన్నారు. 24 గంటలు అప్రమత్తంగా ఉండి కంట్రోల్ రూం నుంచి వచ్చే ఆదేశాలను క్షేత్ర స్థాయిలో అధికారులు అమలుచేయాలన్నారు. విద్యుత్ అంతరాయానికి సంబంధిం చిన సమస్యలుఉంటే విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన 1912, 18004250028 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే విద్యుత్ అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఈ వడ్లకొండ గంగాధర్, డీఈ జంపాల రాజం, ఏఈలు ఆడెపు శ్వేత, హబీబా పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి రద్దు : కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 1: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని భారీ వర్షాల నేపథ్యంలో ఈనెల 2న రద్దు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలతో చెరువులు, కుంటలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగవద్దని, జిల్లా యంత్రాంగం అంతా సహాయక చర్యల్లో నిమగ్నమైనందున ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేశామని చెప్పారు. వచ్చే సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

ఉద్యోగుల సంక్షేమం ప్రభుత్వాల బాధ్యత

నల్లబ్యాడ్జీలు ధరించి ఉద్యోగ, ఉపాధ్యాయుల నిరసన

సుభాష్‌నగర్, సెప్టెంబరు 1: ఉద్యోగుల సంక్షేమం ప్రభుత్వాల బాధ్యత అని ఎంప్లాయిస్ జేఏసీ చైర్మెన్ దారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహ దినం పాటిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించిన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ ఉద్యోగుల హక్కుగా సుప్రీం కోర్టు పేర్కొన్నదన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమల్లోకి తేవాల న్నారు. ఎన్నికల సమయంలో అనేక రాజకీయ పార్టీలు తమ తమ మెనిఫేస్టోలలో పాత పెన్షన్ అమలు చేస్తామని హామీ ఇచ్చాయన్నారు. ఇటీవల యూనిఫైడ్ పెన్షన్ అంటూ మరో విధానాన్ని ఉద్యోగులపై రుద్దే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. ఆసరా పెన్షన్ కన్నా అధ్వానంగా సీపీఎస్ విధానం ఉందన్నారు. కార్యక్రమంలో జేఏసీ కార్యదర్శి సంగెం లక్ష్మణ్ రావు, టీజీవో నాయకులు మడిపెల్లి కాళీచరణ్, విష్ణు వర్దన్, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేశవరావు, కార్యదర్శి లిం గయ్య, ఎన్‌టీవో సంఘం మాజీ అధ్యక్షుడు పర్రే రాజేశం, కేంద్ర సంఘం నాయకులు నాగుల నరసింహస్వామి, రాగి శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘం నాయకులు రాజిరెడ్డి, రవీం ద్రచారి, దామెర మహేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, విజ యేందర్ రెడ్డి, వెం కన్న, విద్యాసాగర్, మోసం అంజయ్య, గాజుల నర్సయ్య, భిక్షపతి, కొండయ్య, రాజేశ్ భరద్వాజ్, హర్మిందర్‌సింగ్, కిరణ్ కుమార్, పోలు కిషన్, కామ సతీష్, లవకుమార్, సుమంత్, రాజేశ్వర్ రావు, శారద, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ ధర్నా



హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

-మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 1: హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. ఆదివారం నగరంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ఆరోపణలు చేయడం దురదృష్టకరమన్నారు. అమలుకు నోచుకోని హామీలనిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఏ గ్రామంలోనైనా రుణమాఫీ పూర్తిస్థాయిలో జరిగిందా చెప్పాలని ఆయన కాంగ్రెస్ నాయకులను నిలదీశారు. దమ్ముంటే ధరణిని రద్దు చేయాలని సవాల్ చేశారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.







జ్వరంతో మహిళ మృతి

ముత్తారం, సెప్టెంబరు 1: మండల కేంద్రానికి చెందిన మామిడి శ్రీలత (45) జ్వరంతో మృతిచెందింది. వారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న శ్రీలతను హను మకొండలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెం దినట్లు భర్త శ్రీనివాస్ తెలిపారు. ఆమెకు భర్త, కొడుకు కూతురు ఉన్నారు.



శ్రీలత(ఫైల్)

విద్యుదాఘాతంతో వృద్ధురాలు..

రామగిరి, సెప్టెంబరు 1: మండలంలోని రాజాపూర్ గ్రామంలో విద్యుదాఘతంతో అంకం రాజమ్మ(65) అనే వృద్ధురాలు మృతిచెందింది. ఆదివారం ఉదయం 9.00 గంటల ప్రాంతంలో ఇంటి ఎదుట రేకుల షెడ్డులో బట్టలు ఆరవేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతురాలి పెద్దకొడుకు సదానందం ఫిర్యాదు మేరకు ఎస్సై చంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 1: మనీ యాప్‌లు వేధించడంతో కాల్వ శ్రీరాంపూర్‌కు చెందిన తుండ్ల శ్రీనివాస్(30) ఇటీవల పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీనివాస్ అవివాహితుడు.

ఇద్దరిపై పిచ్చికుక్క దాడి

చందుర్తి, సెప్టెంబరు 1: చందుర్తి మండలం మూడపెల్లి గ్రామంలో ఆది వారం ఇద్దరు వ్యక్తులపై పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచ్చింది. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బద్దం మల్లారెడ్డి, మధు బస్టాండ్ వద్ద ఉన్నారు. అటువైపు వచ్చిన ఓ పిచ్చికుక్క ఇద్దరిపై దాడి చేసి గాయపరిచింది. బాధితులను స్థానికులు చికిత్స నిమిత్తం వేములవాడలోని ఆస్పత్రికి తరలించారు.


ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

మానకొండూర్, సెప్టెంబరు 1: మండలంలోని ఖాదర్‌గూడెం గ్రామానికి గౌడ శంకర్ (54) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గౌడ శంకర్ ఒంటరి జీవితం గడపడమే కాకుండా అనారోగ్యానికి గురి అయ్యాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై ఆదివారం ఇంటిలోని ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు.

దొంగతనానికి పాల్పడిన వ్యక్తి పట్టివేత

భగత్‌నగర్, సెప్టెంబర్ 1: కరీంనగర్-2 డిపో బస్సు నెం.టిఎస్ 02 యుసి6250లో కండక్టర్ బ్యాగును దొంగిలించిన బి.రమేష్ అనే వ్యక్తిని ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది బస్‌స్టేషన్‌లో పట్టుకుని వన్ టౌన్ పోలీసులకు అప్పగించారు. ఈకార్యక్రమంలో ఏఎస్ఐ లక్‌పతి, సెక్యూరిటీ గార్డ్ జి కవిత, ఆన్‌డ్యూటి కంట్రోలర్ ఐసిఎస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.







ప్రాజెక్టులకు జలకళ

ఉమ్మడి జిల్లాలో శనివారం రాత్రి నుంచి జోరు వర్షం కురిసింది. దీంతో ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. వరద పోటెత్తడంతో అధికారులు ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. చెరువులు, కుంటలు మత్తడి పడుతున్నాయి. వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, అప్రమత్తంగా ఉండాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచిస్తున్నారు.


శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు

శ్రీరాంసాగర్‌కు భారీగా వరద నీరు


జగిత్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు వస్తోంది. ఎస్సారెస్పీలోకి 83,636 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 64.768టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 2,325 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

● వరద కాలువకు నీటి విడుదల..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో ఆదివారం సాయంత్రం వరద కాలువకు నీటిని వదిలారు. హెడ్ రెగ్యులేటర్ గేట్లను ఎత్తి వరద కాలువ దిగువకు 1,500 క్యూసెక్కుల నీటిని అధికారులు వదిలారు. కాగా నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు వస్తోందని, గోదావరి నదీ పరిసరాల ప్రాంతాల్లోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సారెస్పీ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా చేపలు పట్టేవారు, రైతులు, పశువుల కాపరులు నదిలోకి దిగవద్దని కోరారు. అధికారుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

మిడ్ మానేరుకు వరద ఉధృతి

బోయినపల్లి, సెప్టెంబరు 1: శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎగువ భాగాన కురిసిన వర్షంతో మానేరు, మూల వాగు ద్వారా భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి 46,891 క్యూసెక్కుల నీరు చేరుతోంది. 6,550 క్యూసెక్కుల నీటిని బయటకు వదలుతున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 16.215 టీఎంసీల మేరకు ఉంది. కాగా తుఫాన్ ప్రభావం వల్ల ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో పెరిగితే ఎల్ఎండీ ప్రాజెక్టుకు నీటి విడుదలను పెంచుతామని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు కింద ఉన్న మానేరు పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.


మిడ్ మానేరు ప్రాజెక్ట్

ఎల్ఎండీకి పెరిగిన ఇన్‌ఫ్లో


నీటితో కళకళలాడుతున్న దిగువ మానేరు జలాశయం

తిమ్మాపూర్, సెప్టెంబరు1: ఎడతేరపి లేకుండా కురుస్తున్న భారి వర్షాల కారణంగా కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. శనివారం రాత్రి 9గంటల సమయం వరకు ఎల్ఎండిలోని మోయతుమ్మెద వాగు నుండి కేవలం 1100 క్యూసెక్కు. నీరు రాగా, ఆదివారం ఉదయం 6గంటల సమయంలో 2,716 క్యూసెక్కులకు, 9గంటలకు 12,206క్యూసెక్కులకు, మధ్యాహ్నం 2గంటల ప్రాంతములో 15,595, 3గంటలకు 29,879, సాయం త్రం 5గంటలకు 39,047 క్యూసెక్కులకు పెరిగింది. రాత్రి తొమ్మిదిగంటలకు 15,937 క్యూసెక్కులకు తగ్గింది. ప్రా జె క్టులోకి మొత్తం ఇన్‌ఫ్లో 18,320 క్యూసెక్కులు ఉంది. ఎల్ ఎండీ పూర్తి స్థాయి స్థామర్థ్యం 24.034 టీఎంసీలకు కాగా ప్ర స్తుతం 14.76 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు రిజర్వాయర్ నుంచి నీటి విడుదలను అధికా రులు నిలిపివేశారు.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	83.636	2.325	80.5	64.768
ఎల్లంపల్లి	1,15.074	1.15.074	20.175	17.813
మిడ్ మానేరు	46,891	6.550	27.54	16.215
ఎల్ఎండీ	18.320	267	24.034	14.376
ఎగువమానేరు	27,500	------	2.00	2.00


ఎల్లంపల్లి నుంచి దిగువ గోదావరిలోకి వదులుతున్న నీరు

శ్రీపాద ఎల్లంపల్లి గేట్లు ఎత్తిన అధికారులు

పెద్దపల్లి/ధర్మారం/అంతర్గాం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఆదివారం తెల్లవారుజాము వరకు పెద్ద ఎత్తున వరద నీరొచ్చి చేరింది. క్యాచ్ మెంట్ ఏరియా, కడెం ప్రాజెక్టు నుంచి 1,15,074క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా,20 గేట్లు ఎత్తి 1,15,074 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలి పెడుతు న్నారు. దీంతో గోదావరి తీర ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. మరోవైపు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు మూడు మోటార్ల ద్వారా 9,450 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. వరద ప్రవాహాన్ని బట్టి నీటిపారుదల శాఖ అధికారులు గేట్లు ఎత్తుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 20. 175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 17,813 టీఎంసీల నీరు ఉంది. గోదావరి తీర ప్రాంత గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా అధికారులు నిషేధాజ్ఞలు జారీ చేశారు.

నక్కలవాగులో కొట్టుకుపోయి ఉద్యోగి మృతి


పవన్(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 1: నక్కలవాగులో కొట్టుకుపోయి ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందిన సంఘటన మండలంలోని మీర్జంపేట గ్రామ పరిధిలోని కొత్తపల్లిలో చోటుచేసుకుంది. కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన చెప్యాల పవన్(22) మీర్జంపేట గ్రామ పంచాయతీలో కారోబార్‌గా పనిచేస్తున్నాడు. వార్డుల విభజన సందర్భంగా ఆదివారం ఉద్యోగరీత్యా మీర్జంపేట గ్రామానికి వెళ్లి విధులు నిర్వహించి సాయంత్రం తన స్వగ్రామమైన కాల్వశ్రీరాంపూర్‌కు మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో కొత్తపల్లి శివారులోని నక్కలవాగు రోడ్డుపై పొంగి ప్రవహించడంతో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంతో సహా పవన్ నీటిలో కొట్టుకుపోయాడు. పోలీసులు, కాల్వ శ్రీరాంపూర్‌కు చెందిన గ్రామస్తులు పవన్ కోసం వాగులో గాలింపులు చేపట్టారు.సంఘటన స్థలానికి వంద మీటర్ల దూరంలో పొదల్లో చికుకుని ఉన్న పవన్ మృతదేహాన్ని రాత్రి పది గంటల ప్రాంతాంలో స్థానికులు గుర్తించారు. చెప్యాల పవన్ తండ్రి చెప్యాల సదయ్య గ్రామ కార్యదర్శిగా పని చేసి అనారోగ్యంతో మృతి చెందడంతో నాలుగు సంవత్సరాల క్రితం పవన్‌కు మీర్జంపేట గ్రామంలో కారోబార్‌గా ఉద్యోగం వచ్చింది. పవన్ గల్లంత కావడంతో అతని తల్లి స్వరూపతో పాటు కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

కూనారం చెరువులో మత్స్యకారుడి గల్లంతు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 1: కాల్వశ్రీరాంపూర్ మండలంలోని కూనారం చెరువులో పడి మత్స్యకారుడు గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బేతికల్ గ్రామానికి చెందిన గోస్కుల కుమార్(45) మత్స్య సహకార సంఘం మాజీ అధ్యక్షుడు చేతి ధర్మయ్య వద్ద పని చేస్తున్నాడు. కునారం పెద్ద చెరువును చేతి ధర్మయ్య లీజుకు తీసుకొని చేపలు వేశాడు. ఆదివారం చేతి ధర్మయ్య దగ్గర పనిచేసే నలుగురు మత్స్యకారులు కునారం పెద్ద చెరువు మత్తడి వద్ద చేపలు బయటికి వెళ్లకుండా వలలు కడుతుండగా ప్రమాదవశాత్తు గోస్కుల కుమార్ చెరువులో పడి గల్లంతయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మానేరులో మత్స్య కార్మికుడు..

గంభీరావుపేట, సెప్టెంబరు 1: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల మానేరు ప్రాజెక్టు జలాశయంలో మాచారెడ్డి మండలం లచ్చపేటకు చెందిన శివరాములు అనే మత్స్య కార్మికుడు గల్లంతయ్యాడు. శివ రాములు ఆదివారం ఉదయం చేపలు పట్టేందుకు ఇంటి నుంచి వెళ్లాడు. లచ్చపేట సమీపాన ప్రవహించే మానేరులోకి వచ్చే పాల్వంచ వాగులో శివరాములు చేపలు పట్టేందుకు వెళ్లినట్టు గ్రామస్థులు తెలిపారు. లచ్చపేట వాగు వద్ద శివ రాములు దుస్తులు, పాదరక్షలు లభించడంతో చేపలు పట్టే క్రమంలో గల్లంతయ్యినట్టు గ్రామస్థులు భావిస్తున్నారు.

చెరువు నీటిలోకి వెళ్లి విద్యుత్ లైన్ల మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న అసిస్టెంట్ లైన్‌మన్ రంజిత్

రామడుగు, సెప్టెంబరు 1: భారీ వర్షాలతో రామడుగు మండల కేంద్రానికి ఆదివారం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో అసిస్టెంట్ లైన్‌మన్ రంజిత్ నడుము లోతు నీళ్లలో నుంచి నడుచుకుంటూ వెళ్లి చెరువులో ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కి లైన్‌ను సరి చేశాడు. వివరాలిలా ఉన్నాయి.. శనివారం రాత్రి నుంచి రామడుగులో భారీ వర్షం కురుస్తోంది. గ్రామానికి వచ్చే విద్యుత్ లైన్‌కు సంబంధించిన కొన్ని స్తంభాలు చెరువు సమీపంలో ఉన్నాయి. భారీ వర్షాలకు ఆ స్తంభాల చుట్టూ చెరువు నీరు చేరింది. అందులో ఓ స్తంభం వద్ద లైన్ సాంకేతిక ఇబ్బంది ఏర్పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాల మేరకు అసిస్టెంట్ లైన్‌మన్ రంజిత్ భారీ వర్షం కురుస్తున్నా నడుములోతు నీటిలో నుంచి నడుచుకుంటూ వెళ్లి స్తంభం ఎక్కి లైన్‌ను సరి చేశాడు. దీంతో గ్రామానికి విద్యుత్ వచ్చింది. రంజిత్‌ను గ్రామస్థులు, అధికారులు అభినందించారు.

కూలిన రామడుగు బ్రిడ్జి


అధికారులతో కలిసి బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు, సెప్టెంబరు 1: శిథిలావస్థకు చేరిన రామడుగు బ్రిడ్జి వరద ప్రవాహానికి ఆదివారం కూలిపోయింది.. స్థానిక అధికారులు బ్రిడ్జికి ఇరువైపులా బారికేడ్లు, ట్రాక్టర్లు అడ్డుగా పెట్టి రాకపోకలను నియంత్రించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికారులతో అక్కడికి చేరుకుని బ్రిడ్జిని పరిశీలించారు.. నూతన బ్రిడ్జిలో భూములు కోల్పోయిన వారికి తక్షణమే పరిహారం అందించి త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.. అప్పటివరకు రాకపోకలకు తాత్కాలికంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశాలు జారీ చేశారు. బ్రిడ్జి తెగిపోయిన నేపథ్యంలో ఇటువైపు రావొద్దని ఎస్సై సురేందర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

భారీ వర్షాలతో తిరుపతి రైలు రద్దు


వెలవెలబోతున్న కరీంనగర్‌రైల్వే స్టేషన్

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 1: రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు కరీంనగర్ నుంచి తిరుపతి వెళ్లే రైలును అధికారులు రద్దు చేశారు. శనివారం రాత్రి తిరుపతి నుంచి కరీంనగర్ బయలుదేరిన రైలు తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు విజయవాడ సమీపంలో నిలిపి వేశారు. ఆదివారం రాత్రి కరీంనగర్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరాల్సిన రైలును రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. రైలు రద్దుపై సరైన సమాచారం లేదని, రైల్వే అధికారులు నిర్లక్ష్యమైన సమాధానం ఇస్తున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ధర్మపురి వద్ద ప్రమాద స్థాయిలో గోదావరి వరద


ధర్మపురి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ధర్మపురి, సెప్టెంబరు 1: ధర్మపురి వద్ద గోదావరి నది వరద ఆదివారం సాయంత్రం ప్రమాద స్థాయికి చేరింది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు అనేక గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలు నిండి పోయాయి. దీనికి తోడుగా నిర్మల్ జిల్లా కడెం-నారాయణరెడ్డి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరింది. ఉదయం ఏడు గంటల వరకు ప్రాజెక్టు లోనికి 65,130 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. దీంతో ప్రాజెక్టు సంబంధించిన 10 గేట్లు తెరచి 79,166 క్యూసెక్కుల నీరు దిగువ గోదావరి నదిలోకి అధికారులు విడుదల చేశారు. దీంతో గోదావరి నీటి మట్టం క్షణక్షణం పెరిగి వేగంగా ప్రవాహం కొనసాగింది. సాయంత్రం ఐదు గంటల వరకు కడెం ప్రాజెక్టులోకి 32,168 ఇన్‌ఫ్లో కొనసాగడం వల్ల కొంత మేరకు నీరు తగ్గించారు. దిగువ గోదావరి నదిలోకి 18,522 క్యూసెక్కులు విడుదల చేశారు. సత్యవతి, బ్రహ్మగుండం పైనుంచి వేగంగా నీటి ప్రవాహం కొనసాగడం వల్ల చిన్నగద్దె, మంచి నీటి బావి నీటిలో మునిగిపోయింది. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది అప్రమత్తం చేశారు. నదీ తీరాన గల ఆరెపల్లి, దొంతాపూర్, జైనా, రాజారం, గోదావరి వరద వల్ల ప్రజలు ఆందోళన చెందవద్దని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తమై జాగ్రత్తగా ఉండాలన్నారు. . కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

▸▸ క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలి ▸▸ మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వెంటనే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. వర్షాల నేప థ్యంలో ఆదివారం ఉదయం కరీంనగర్ కార్యాల యం నుంచి మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తూ అప్రమత్తం చేశారు. కంట్రోల్ రూమ్ ద్వారా వచ్చిన ఫిర్యా దులకు వెంటనే స్పందించాలని అధికారులను ఆదేశించారు. పురాతన, శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి అక్కడి నుంచి ప్రజలు ఇతర ప్రాంతాలకు పంపించాలన్నారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలుంటాయన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా స త్పతి, జిల్లా అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షి స్తూ ప్రాజెక్టుల నీటి వివరాలను అడిగి తెలుసుకు న్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సంజిత్‌కు మార్ ఝూ, ఎస్పీ అఖిలేష్ మహాజన్‌తో ఎప్పటి కప్పుడు సమీక్షించారు. మిడ్‌మానేరుకు వస్తున్న వరద, ఎగువ మానేరు పరిస్థితిని అడిగి తెలుసుకు న్నారు.


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఎంజేపీ గురుకులంలో విద్యార్థుల ఆందోళన

-మాడిన అన్నం పెట్టారని సాయంత్రం వరకు పస్తులు

-ప్రిన్సిపాల్ ఆదేశాలతో మళ్లీ వండిపెట్టిన నిర్వాహకులు

సైదాపూర్, సెప్టెంబరు 1: సైదాపూర్ మహాత్మాజ్యోతిరావు పూలే (బాలుర) గురుకుల పాఠశాలలో ఆదివారం మధ్యాహ్నం మాడిన అన్నం పెట్టారని విద్యార్థులు ఆందోళన చేశారు. ఆదివారం అన్నం మెత్తగా వండడంతో పాటు మాడిపోవడంతో విద్యార్థులు అన్నం తినకుండా సాయంత్రం వరకు ఉన్నారు. 9,10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు ఆందోళన చేయడంతో ప్రిన్సిపాల్ ఆదేశాలతో వంటల నిర్వాహకులు మళ్లీ అన్నం వండి పెట్టారు. దాంతో సాయంత్రం అన్నం తినాల్సి వచ్చిందని విద్యార్థులు తెలిపారు. దీనిపై సైదాపూర్ ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా మూడు గంజుల్లో అన్నం వండగా ఒక గంజులో మాడిపోయిన మాట వాస్తవమేనన్నారు. వంటవారిని మందలించి మళ్లీ వండి విద్యార్థులకు పెట్టామన్నారు. చాలా రోజుల నుంచి గిన్నెలు కారుతున్నాయని వంటవారు చెప్పారని, ఆ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఇలాంటి సంఘటనలు జరుగకుండా చూస్తామని తెలిపారు. కాగా సైదాపూర్‌లో సరైన భవనం లేకపోవడంతో సైదాపూర్ ఎంజేపీ గురుకుల పాఠశాలను హుజూ రాబాద్‌లోని బోర్నపల్లి వద్ద బిల్డింగ్ కిరాయికి తీసుకొని నిర్వహిస్తున్నారు. ఆ బిల్డింగ్‌కు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందని, వెంటనే నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి



యూఎస్ఎఫ్ఐలో చేరిన వారికి కండువా కప్పుతున్న నాయకులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 1: ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో ఉద్యమాలు నిర్వహిస్తామని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వాగేశ్వరీ డిగ్రీ, పీజీ కళాశాలలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సంద గణేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి తిరుపతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం లోకి వచ్చి ఏడు మాసాలు గడుస్తున్నప్పటికీ పూర్తిస్థాయి విద్యా శాఖ మంత్రిని నియమించకపోవడం శోచనీయమని మండి పడ్డారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమిం చాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాక ముందు యూనివర్సిటీ అభివృద్ధి కోసం ప్రత్యేక కృషి చేస్తామని చెప్పి హామీలను విస్మరించారన్నారు. తక్షణమే ప్రభుత్వ విద్యాలయా లను సందర్శించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లకు పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. అనంతరం ఉత్తర తెలంగాణకు సంబంధించిన వివిధ విద్యార్థి సంఘం నాయకులు ఉమ్మడి ఆదిలాబాద్‌కు చెందిన నాయకులు యుఎస్ఎఫ్ఐ సంఘంలో చేరారు. వారికి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కండువా కప్పి ఆహ్వానించారు. సమావేశంలో పెద్దపల్లి జిల్లా మాజీ నాయకుడు రామగల సురేష్ చేరారు. కరీంనగర్ జిల్లాలో ఉమామహేశ్వర్, మయూరి, అక్షయలతో పాటు ఇతరులు చేరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు బి తిరుపతి కుమార్. జిల్లా నాయకులు సంతోష్, మల్లికార్జున, సతీష్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం


పెద్దపల్లి జిల్లా పెద్దబొంకూరులో ఇంట్లోకి వెళ్లిన వర్షపు నీరు


వరదతో నిండిపోయిన ఫైవింక్లయిన్ రహదారి


కోరుట్లలోని ప్రకాశం రోడ్డులో నిలిచిన వరదనీరు


సైదాపూర్‌లో లోలెవల్ వంతెనపై చిక్కుకున్న ఆటోను తీస్తున్న ప్రజలు


అలుగు పారుతున్న కొత్తపల్లి చెరువు


చిగురుమామిడి మండలంలో ఇంట్లోకి చేరిన వరదనీరు


మత్తడి దూకుతున్న సర్వాయిపేట కొచ్చెరువు

దంచికొట్టిన వాన

చెరువులు, కుంటల్లోకి వర్షపునీరు
-జలమయమైన రహదారులు
-పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
-పలు మండలాల్లో కూలిన ఇళ్లు


కరీంనగర్‌లో పీటీసీ నుంచి బైపాస్ రోడ్డుకు చేరుతున్న వర్షపు నీరు


మామిడాలపల్లి-పచ్చునూరు రోడ్డుపై బారికేడ్లు ఏర్పాటు


అన్నారంలో మత్తడి పడుతున్న నాగుల చెరువు


గుండ్లపల్లి దగ్గర లోలెవల్ కల్వర్టును దాటేందుకు ప్రయాణికుల ఇబ్బందులు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 1: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం కారణంగా నగరంలో రెండు రోజులు నుండి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం రాత్రి వరకు కురిసిన భారీ వర్షంతో ప్రధాన రహదారులన్నీ జలమయంగా మారాయి. కలెక్టరేట్ ముందు భారీగా వరద నీరు చేరడంతో బారీకేడ్లు వాహనాలను దారిమళ్ళించారు. అలాగే పోలీసు హెడ్ క్వార్టర్స్, ఎన్టీఆర్ విగ్రహం ముందు, రాంనగర్ టీవీ టవర్, ఆర్టీసీ జోనల్ వర్క్‌షాపు ముందు రోడ్డుపై వర్షపు నీరు భారీగా నిలువడంతో నగరపాలక సంస్థ డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి ప్రొక్లెయిన్ సహాయంతో నీటిని మళ్ళించే వరకు వాహనాల రాక పోకలకు దారి మళ్ళించారు. 44వ డివిజన్ పరిధిలోని మంచిర్యాల చౌరస్తా, శర్మనగర్, కార్ఖానగడ్డ తదితర ప్రాంతాల్లో వరదనీరు రోడ్లపై నిలువడమేకాకుండా ఇళ్ళలోకి చేరడంతో కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్రశేఖర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళారు. డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణిహరిశంకర్ శర్మనగర్, తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ మెండి శ్రీలతచంద్రశేఖర్‌తో కలిసి పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ఏమైనా సమస్యలుంటే నగరపాలక సంస్థలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నెంబర్ 98499 06694, 0878-2237700 నెంబర్లకు ఫోన్ చేయాలని, 24 గంటలపాటు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. 34వ డివిజన్‌లో కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి డివిజన్‌లో పర్యటించిన వరద నీరు నిలిచిన ప్రాంతాలను సందర్శించి వాటిని డిఆర్ఎఫ్ సిబ్బందితో తొలగించే వరకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. ముకరంపురలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఒక కాలనీలో భారీగా వరద నీరు ఇళ్ళలోకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాంనగర్, మంకమ్మతోట, ముకరంపుర, శర్మనగర్, అల్కాపురికాలనీ, ఆర్టీసీ వర్క్‌షాపు, మంచిర్యాల చౌరస్తా, శర్మనగర్, ఆటోనగర్, లక్ష్మీనగర్, హన్మాన్‌నగర్, కట్టరాంపూర్, సాలంపుర, శ్రీహరినగర్, పద్మనగర్, దుర్గానగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపైకి భారీగా వరద నీరు పొంగి పొర్లడంతో ఆయా ప్రాంతాలవాసులు ఇళ్ళ నుంచి బయటకు వెళ్ళలేని పరిస్థితి ఏర్పడింది. నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్‌తోపాటు ఇతర అధికారులు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ఎన్డీఆర్ బృందాలను అప్రమత్త ంచేసి ప్రజలకుఇ బ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వెంటనే రంగంలోకి దిగి వర్షంలోనే వరదనీటిని మళ్ళించడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. కాంగ్రెస్ కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, నేతికుంట యాదయ్య, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున రాజేందర్, టిపిసిసి కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, నాయకులు మాచర్ల ప్రసాద్, రాచకొండ చక్రధర్‌రావు , ఎడ్ల శ్రీనివాస్ నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో వరద నీటి పరిస్థితిని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్ళారు. దీనితో మంత్రి మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆదివారం సెలవు రోజు కావడం, మరోవైపు భారీ వర్షం కారణంగా నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్, తెలంగాణచౌక్, టవర్‌సర్కిల్ వంటి రద్దీ ప్రాంతాలు కూడా నిర్మానుష్యంగా మారాయి.

●కరీంనగర్ అర్బన్: అలకాపురికాలనిలోని పలు రహదారుల్లో మురికి కాలువలు లేక ఎక్కడికక్కడ నిలిచి పోతున్నాయని, 10 లక్షల సుడా నిధులతో మురికి కాలువలు నిర్మిస్తామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తెలిపారు. వర్షాలకు నగరంలో నీళ్ళు నిలిచిపోయిన పలు ప్రాంతాలను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. అల్కాపురి కాలని రోడ్ నెంబర్ 4, 5 ప్రాంతాలకు పై ప్రాంతం నుంచి వర్షం నీళ్ళు రావడం వల్ల మురికి కాలువలు లేక ఎక్కడికక్కడ రహదారులపై నీళ్ళు నిలిచి పోతున్నాయని స్థానికులు నరేందర్‌రెడ్డి దృష్టిక తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ 40 అడుగుల సీసీ రోడ్ వరకు మురికి కాలువలో కలిపే విధంగా సుడా నుండి పది లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. లక్ష్మీనగర్‌లోని ఆమీర్ నగర్‌లో దెబ్బ తిన్న మురికి కాలువ వల్ల నీళ్ళు బయటకు వెల్లడంలేదని త్వరలో మురికి కాలువ నిర్మాణానికి అధికారులతో మాట్లాడి పూర్తి చేయిస్తామని నరేందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో సుడా ఏఈ రమేష్ పాల్గొన్నారు.

●కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లో కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. ఆర్టీసీ వర్క్‌షాప్ నుంచి వి పార్క్‌హోటల్ ప్రాంతం వరకు రోడ్డుపైకి మోకాలు ఎత్తులో వరద నీరు చేరి వాహనాలు, ప్రయాణికుల రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. దీంతో ట్రాఫిక్ సీఐ పర్శ రమేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను మళ్లించారు. పోలీసులు, మున్సిపల్ సిబ్బంది దాదాపు 2 గంటలు శ్రమించి రోడ్డు డివైడర్ కొంత భాగాన్ని తాత్కాలికంగా తొలగించి రోడ్డుపై నిలిచిన వర్షపునీటిని దిగువకు పంపారు. రోడ్డుపై నిలిచిన నీరు క్లియర్ కావడంతో వాహనాల రాకపోకలు యదావిధిగా సాగటంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

●కరీంనగర్‌రూరల్: తీగలగుట్టపల్లిలోని సరస్వతినగర్, హనుమాన్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఖాళీ ప్లాట్లలో వర్షం నీరుచేరిపోవడంతో నానా పాట్లు పడుతున్నారు. కరీంనగర్ రూరల్ మండలంలోని దుర్శడ్‌లో రాజీవ్ రహదారిపై మోకాళ్లలోతులో వరద నీరు రోడ్డుపై ప్రవహించడంతో భారీ వాహనాలు, చిన్న వాహన దారులు రోడ్లపై నానా పాట్లు పడ్డారు. దుర్శేడ్ బస్టాప్ వద్ద హైవేరోడ్డు వద్ద డ్రైనేజీ నిర్మించక పోవడంతో వరద నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా హైవే అధికారులు టోల్ టాక్స్ వసూలు చేస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

●భగత్‌నగర్: కొత్తపల్లి పెద్ద చెరువు భారీ వర్షాలకు మత్తడి దూకుతున్నది. కొత్తపల్లి పట్టణ కేంద్రంలో ఉన్న ఊర చెరువు నిండుకుండలా మారిపోయింది. కొత్తపల్లి-చింతకుంట మల్కాపూర్ గ్రామాలకు వెళ్లందుకు నూతనంగా నిర్మించిన బ్రిడ్జిపై సదర్మకుల తాకిడి ఎక్కు వయింది. కొత్తపల్లి-కొక్కెర కుంటకు వెల్లే రైల్వే ట్రాక్ కింద భారీగా వరద నీరు చేరిపోవడంతో రాక పోకలు స్తంభించిపోయాయి. తీగలగుట్టపల్లి నుంచి ఆరెపల్లి మీదుగా రేకుర్తి వెళ్ల రహదారిలో రైల్వే ట్రాక్ కింద వరద నీరు చేరిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. కరీంనగర్-సిరిసిల్ల రోడ్డుపై చింతకుంట, బావుపేట, కమాన్‌పూర్ రోడ్డుపై వర్షం నీరు చేరి పోవడంతో రాక పోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. కొత్తపల్లి, మల్కాపూర్, చింతకుంట, కమాన్‌పూర్‌కు వెళ్లే బైపాస్‌రోడ్లు, అంతర్గత రోడ్లు వర్షం నీటితో నిండిపోయాయి. మండల వ్యాప్తంగా శిధిలావస్థలో ఉన్న ఇళ్ల వారిని రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా వర్షాలకు ఏలాంటిప్రాణ, ఆస్తినష్టం సంభవించలేదు.

●హుజూరాబాద్: హుజూరాబాద్ డివిజన్‌లో శనివారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా ఆదివారం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. హుజూరాబాద్ పట్టణంలోని బుడగజంగం, మామిండ్లవాడ, గాంధీనగర్ కాలనీలలో రోడ్లపై, ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చి చేరింది. పట్టణ శివారులోని చిలకవాగు ఉప్పొంగింది. దీంతో హుజూరాబాద్ నుంచి కనుకులగిద్దె గ్రామానికి వెళ్లే రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లోని వరి పొలాలు నీట మునిగాయి. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు మురికి కాలువలలోని చెత్తాచెదారాన్ని తొలగించారు. వర్షాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు వొడితెల ప్రణవ్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిలు కోరారు.

●శంకరపట్నం: అంబాలాపూర్ ఊర చెరువుకు గండి పడింది. కేశవపట్నం వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. ముత్తారం చెరువు మత్తడి దూకుతుంది. అర్కండ్లలో లెవల్ బ్రిడ్జిపై నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కేశవపట్నంలో కరీంనగర్-వరంగల్ రహదారిపై భారీగా నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

●వీణవంక: మండలంలో జమ్మికుంట-కరీంనగర్ రహదారిని తాత్కాలికంగా మూసి వేసి వాహనాలను దారి మళ్ళించారు. ఎంపీడీవో శ్రీధర్ మామి డాలపల్లి,నర్సింగాపూర్ గ్రామాల వద్ద రహదారిపై వరద నీరు చేరడంతో వాటిని పరిశీలించి రహదారులు మూసి వేయించారు. మండలంలోని వీణవంక, ఎల్బాక, ఘన్ముక్ల, రెడ్డిపల్లి, కనపర్తి, బేతిగల్ ,మామిడాలపల్లి, చల్లూరు గ్రామాల్లో చెరువులు కుటంటలు మత్తడి దూకుతున్నాయి. వీణవంక వాగు ఉధృతంగా ప్రవహస్తోంది.

●సైదాపూర్: సైదాపూర్ మండలంలో వాగులు పొంగి ప్రవహిస్తుండడంతో సోమారం-ఎక్లాస్‌పూర్, సోమారం-మొలంగూర్, ఎలబో తారం-గొగిశాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. సైదాపూర్ వద్ద లో లెవల్ వంతెన గుంతల మయంగా మారడంతో ఆ గుంతలో ఆటో టైరు పడి చిక్కుకు పోయింది. దాంతో స్థానికులు ఆటోను బయటకు తీశారు.

●ఇల్లందకుంట: మండలంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో మండలంలోని అన్ని గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండు కుండలా చేరుకు న్నాయి. పాతర్లపల్లి గ్రామంలో కల్వర్టుపైకి నీరు రావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి.

●తిమ్మాపూర్: మండలంలో వాగులు, కుంటలు, చెరువులు పొంగి పొర్లుతున్నాయి. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. పలు ఇండ్లలోని నీళ్ళు రావడంతో ఒకటి రెండు చోట్ల ఇళ్ల పాక్షికంగా దెబ్బ తిన్నాయి. తిమ్మాపూర్ నుండి పోరండ్ల గ్రామానికి వెళ్ళే ప్రధాన రోడ్డు మార్గము నుంచి భారీగా వరద నీరు ప్రవహిస్తుండటంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచి పోయాయి. ఇందిరానగర్ గ్రామం నుండి మన్నెపల్లి గ్రామానికి వెళ్ళే మార్గంలో కల్వర్టుపై నుంచి భారిగా వరద నీరు ప్రవహిస్తుడటంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పోలంపల్లి గ్రామం నుంచి మొగిళిపాలెం గ్రామానికి వెళ్ళే దారిలో కల్వర్టు పూర్తిగా ధ్వంసం అయి భారిగా వరద నీరు ప్రవహిస్తుంది. వచ్చునూర్- రాంహనుమాన్ నగర్ మధ్య రోడ్డం పై నుండి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఇందిరానగర్ లోని దొనబండ కుంట, బలయ్యపల్లె లోని బిబ్బిలివాణి కుంట, నెదునూర్‌లోని బొమ్మలకుంట కుంటలు మత్తడి దూకుతున్నాయి.

●భారి వర్షాలు కురుస్తుండటంతో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశించారు. ఆదివారం పలు గ్రామాలను పర్యటించి ఆయా గ్రామాలలో ప్రజల ఇబ్బందులను తెలుసుకొని వారి సమస్యలను పరిష్కరించాలని అధి కారులను ఆదేశించారు. రేణికుంట బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మోయతుమ్మెద వాగు వరద ప్రవాహాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. కొత్తపల్లి గ్రామంలో రెడ్డి కాలనీలో ఇండ్లలోకి వచ్చిన నీటిని పరిశీలించారు.

●మానకొండూర్: మానకొండూర్ మండలంలోని శ్రీని వాస్‌నగర్, ఈదులగట్టెపల్లి, అన్నారం, చెంజర్ల, జగ్గయ్యప ల్లి, గంగిపల్లి, కొండపల్కల, మద్దికుంట, పచ్చునూర్, ఊ టూర్ తదితర గ్రామాలలోని పంటపొలాలు నీటమునిగి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మానకొం డూర్, అన్నారం, ఈదులగట్టెపల్లి, లలితాపూర్, పోచంపల్లి, రంగపేట, లింగాపూర్, వెల్ది, దేవంపల్లి గ్రామాలోని రోడ్డు డ్యాంల నుంచి నీరు ప్రవహించడంతో లారీలు, బస్సులు, వ్యానులు అతికష్టం మీద బయటికి వెళ్తున్నాయి. దేవంప ల్లి నుంచి, కొండపల్కల, గంగిపల్లి నుంచి దేవంపల్లి, అన్నా రం నుంచి లింగాపూర్, అన్నారం నుంచి చెంజర్ల మట్టి రో డ్లు గుంతలమయంగా తయారు అయ్యాయి.

మూడు ఇళ్ల పూర్తిగా నేలమట్టం

●చిగురుమామిడి: మండలంలో జిల్లాలోనే అత్యధికంగా 84.2 శాతం వర్షం కురిసినట్లు నమోదైంది. మండలంలోని రేకొండ-మొగిళిపాలెం గ్రామాలకు వెళ్లే రహదారి వద్ద బ్రిడ్జి లేక వరద తాకిడి పెరిగి పోయింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్గింది. ఇందుర్తి-కోహెడ మండలనికి వెల్లె రహదారి వద్ద మోయతుమ్మెద వాగు ఉధృతికి రాక పోకలు నిలిచి పోయాయి. రేకొండ-ఎగ్లాస్‌పూర్ గ్రామాలకు వెల్ల కుండ సరైనా కల్వర్టు లేక రాకపోకలు నిలిచి పోయాయి. కొండపూర్, రేకొండ, సుందరగిరి, చిన్నముల్కనూర్ గ్రామాల్లో నాలుగు ఇళ్ల పూర్తిగా కూలి పోయాయి. సుందరగిరి గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలోకి వర్షపు నీరు చేరింది. కొండపూర్, ఉల్లంపల్లి, సుందరగిరి, నవాబుపేట, బొమ్మనపల్లి గ్రామాల్లో వరి పంట పొలాలు పూర్తిగా నీట మునిగి నీటిలో కొట్టుకు పోయాయి. ఓగులాపూర్ గ్రామంలోని పలు వార్డుల్లోకి, ఇండ్లలోకి వర్షాపు నీళ్ల చేరింది. ఉల్లంపల్లి, బొమ్మనపల్లి, గ్రామాలతో పాటు మరో కొన్ని గ్రామాల్లో మట్టి రోడ్ల తెగి పోయినాయి. రెండు రోజులు నుండి వరుసగా కురుస్తున్న వర్షాం వల్ల మండలంలో ఎలాంటి ప్రాణ నష్టం, ఇతర నష్టం జరగలేదని తహసీల్దార్ ముద్దసాని రమేష్ తెలిపారు. జిల్లాలోనే చిగురుమామిడి మండలంలో అత్యధికంగా వర్షం పడిందన్నారు.

●గన్నేరువరం: మండలంలోని గన్నేరువరం పెద్ద చెరువు, గుండ్లపల్లి దేవుని చెరువు, జంగపల్లి, పారువెల్ల చెరువులు నిండి లోలెవల్ కల్వర్టులపై వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో మండలానికి రాకపోకలు బంద్ అయ్యాయి. గన్నేరువరం చెరువు, గుండ్లపల్లి చెరువు పూర్తి స్థాయిలో నిండి మత్తడి దూకుతూ వరద నీరు కల్వర్టుపై భారీగా ప్రవహించడంతో రెవిన్యూ అధికారులు చెరువు వద్ద రాకపోకలను నిలిపివేశారు. జంగపల్లి, హన్మాజిపల్లి మధ్యలో ఉన్న లోలెవల్ కల్వర్టుపై వరద నీరు భారీగా ప్రవహిస్తోంది.

●మండలంలోని వివిధ గ్రామాల చెరువుల వద్ద ఉన్న లోలెవల్ కల్వర్టులను హైలెవల్ కల్వర్టులుగా నిర్మించేందుకు త్వరలోనే కృషి చేస్తానని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గుండ్లపల్లి దేవుని చెరువు వద్దకు చేరుకొని కల్వర్టుపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీటిని పరిశీలించారు. చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో రోడ్డును ఆనుకొని కరీంనగర్ పాల డెయిరీని అక్రమంగా నిర్మించడంతోనే మత్తడి వైశాల్యం తగ్గి ఇరుకుగా మారి వరద ఉధృతి పెరిగిందని స్థానికులు ఎమ్మెల్యే వివరించారు. డెయిరీ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

●చొప్పదండి: మండలంలో 93 మిమి ల వర్షపాతం నమోదైంది. ఆర్నకొండ రాగంపేట మధ్య పంది వాగు ఉధృతంగా ప్రవహించగా రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్ఐ అనూష పంది వాగు వద్ద బారికేడ్‌లను ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారు. చొప్పదండిలోని పలు చోట్ల ఇండ్ల మధ్య నీరు నిలిచిపోయాయి.

●గంగాధర: ఎగువన కురుస్తున్న వర్షాలకు కొడిమ్యాల మండలం నుండి వరద ఉధృతంగా వస్తుంది. వెంక టయ్యపల్లి బ్రిడ్జిని తాకుతూ వరద నారాయణపూర్ రిజర్వాయర్‌లోకి భారీగా చేరుతుంది. ఎగువ వరద నీరు రిజర్వాయర్‌లోకి చేరడంతో మత్తడి నుండి దిగువకు వరద వెళ్తోంది. గంగాధర, పెగడపల్లి మండలాల రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని కురిక్యాల కల్వర్టుపై వరదనీరుతో ఉప్పరమల్యాల, గర్షకుర్తి గ్రామాలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. లక్ష్మీదేవిపల్లి, గర్షకుర్తి, నారాయణపూర్, నాగిరెడ్డిపూర్, చర్లపల్లి గ్రామాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరింది. తహసీల్దార్ అనుపమ, ఎస్ఐ కిరణ్‌రెడ్డిలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

●రామడుగు: రామడుగు విద్యానగర్ ప్రాంతం భారీ వర్షానికి జలమయంగా మారింది. ఇళ్లలోకి నీరు చేరింది. గుండి చెరువు నిండి మత్తడి దూకింది. గుండి నుంచి దేశాయిపేట వెళ్లే రహదారి కోతకు గురవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గుండి నుంచి లక్ష్మీపూర్ వెళ్లే రోడ్ డ్యామ్ పొంగిపొర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి.


కరీంనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద రోడ్డుపై నిలిచిన నీరు


రామడుగులో ఇంట్లోకి చేరిన నీరు


శంకరపట్నంలో రహదారిపై నిలిచిన వర్షపు నీరు


కరీంనగర్‌లోని ముకరంపురలో జలమయమైన వీధి

మంత్రి పొన్నంను కలిసిన రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న తనుకు సురేశ్

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 1: రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తనుకు సురేశ్, పాలకవర్గ సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా వారు రా రైస్ మిల్లర్ల అసోసియేషన్‌ను ఇటీవలనే ఏర్పాటు చేసుకొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందని, తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

గంగాధర ఎస్ఐకి ప్రమోషన్

గంగాధర, సెప్టెంబరు1: గంగాధర ఎస్ఐ కిరణ్‌రెడ్డి సీఐగా పదోన్నతి పొందారు. 2012 బ్యాచ్‌కు చెందిన కిరణ్‌రెడ్డి గంగాధరలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల క్రితం పోలీస్ శాఖ పలువురి ఎస్ఐలకు సీఐలు పదోన్నతి కల్పించగా గంగాధర ఎస్ఐ కిరణ్‌రెడ్డికి అవకాశం లభించింది.సీఐ ప్రమోషన్‌లో సిద్దిపేటకు బదిలీపై వెలుతున్నట్లు కిరణ్‌రెడ్డి తెలిపారు.

ఎస్‌జీటీలకు ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటు హక్కు కల్పించాలి

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 1: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జిటి ఉపాధ్యాయులకు శాసనమండలి ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర కార్యదర్శి, కరీంనగర్ జోనల్ ఇంచార్జి వీరమల్ల వెంకట రమణరావు కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కోరారు. ఈమేరకు వారు ఆదివారం నగరంలో మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈకార్యక్రమంలో తపస్ బాధ్యులు ప్రవీణ్‌రెడ్డి, శ్రీదర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగాలి



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్

భగత్‌నగర్, సెప్టెంబర్ 1: కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ముందకు సాగాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం వెంకటేష్ అన్నారు. ఆదివారం నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో గ్రేటర్ హైదరబాద్ పరిధిలోని సిఐటియు నాయకత్వానికి రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులు ఈ నెల 4వ తేదీ వరకు జరుగుతాయన్నారు. కార్మిక వర్గం ఎదుర్కొంటున్న అనేక రాజకీయ, సామాజిక సాంస్కృతిక పరమైన అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. భవిష్యత్తులో ఉద్యమాన్ని పటిష్టం చేయడానికి శిక్షణ తరగతులు దోహదం చేస్తాయన్నారు. శిక్షణ తరగతులకు అతిథ్యం ఇస్తున్న కరీంనగర్ జిల్లాకమిటీకి, శిక్షణ తరగతులు జయప్రదానికి సహకరిచంఇన ప్రతి ఒక్కరికి విప్లవ అభినందనలు అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు నోటిపై చేసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ విధానం ద్వారా కార్పోరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారన్నారు. శిక్షణ తరగతు లకు ముందుగా జిల్లా అధ్యక్షుడు జె కుమారస్వామి జెండాను అవిష్కరించారు. ఈ సమావేశంలో సిఐటియు హైదరాబాద్ కోశాధికారి కె అజయ్‌బాబు, నాయకులు డిఎల్ మోహన్, జి రాములు, ఎం సత్యనారాయణ, ఆర్ అశోక్, కిరణణ్మయి, శ్యామలీల తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా

హుజూరాబాద్, సెప్టెంబరు 1: హుజూరాబాద్ పట్టణంలో పెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా ఆదివారం తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తాప్రా జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ మధ్య కాలంలో కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ విధానాన్ని అమలు పరుస్తామని హామీ ఇచ్చినప్పటికి సంతృప్తికరంగా లేదన్నారు. కార్యక్రమంలో చీకట్ల సమ్మయ్య, వీరస్వామి, మునీరుద్దీన్, కిష్టయ్య, జమదగ్ని, శ్రీహరి, సనత్‌కుమార్, హరికిషన్, సమ్మయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ అకాడమిక్ వార్షికోత్సవం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 1: కరీంనగర్ ఐఎంఏ ఆధ్వర్యంలో అకాడమిక్ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఆదివారం నగరంలోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో నిర్వహించిన ఈ వార్షిక వైద్య సంబంధిత వార్షికోత్సవంలో హైదరాబాద్ వివిద విభాగాలకు చెందిన వైద్యనిపుణులు పాల్గొన్నారు. డాక్టర్ కటకం నర్మద సంతాన సాఫల్యతలో శాస్త్రీయ మార్పుల గురించి వివరించారు. డాక్టర్ నల్లపరెడ్డి కవిత న్యూక్లియర్ మెడిసిన్‌కు సంబందించిన విషయాలు, సాధించిన ప్రగతి గురించి తెలియచేశారు. డాక్టర్ రవీంద్రరెడ్డి మాట్లాడుతూ వైద్యరంగంలో పాత కొత్త మార్పులు, వైద్య చట్టాల సంబందిత అంశాలపట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ వెంకట్‌రెడ్డి, డాక్టర్ మల్లిఖార్జున్, డాక్టర్ కె శ్యాంసుందర్, డాక్టర్ విజేంద్రరెడ్డి, డాక్టర్ జగన్‌మోహన్‌రావు, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ హరికిషన్, డాక్టర్ రవీందర్‌రావు, డాక్టర్ కిషన్, డాక్టర్ రమ, డాక్టర్ మాధవి, డాక్టర్ నయని, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్‌రావు, డాక్టర్ సుధ ఇతర వైద్యులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల ఉన్నతికి కృషి

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 1: విశ్వబ్రాహ్మణుల ఉన్నతికి కృషి చేస్తానని రాష్ట్ర మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఆదివారం నగరంలోని జిల్లా విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రజతోత్సవ ప్రారంభ వేడుకలు, కమ్యునిటి హాలు ప్రారంభించారు. అనంతరం సర్వసభ్య సమావేశం మొగ్ధుంపూర్‌లోని వోపా ప్రొఫెసర్ జయశంకర్ సార్ కమ్యునిటీ హాల్‌లో జరిగాయి. వోపా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కట్ల విష్ణువర్ధన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్‌చారర్య, మొగ్ధుంపూర్ విశ్వబ్రాహ్మణ కాలని అధ్యక్షుడు గద్దె సత్యనారాయణ, రాష్ట్ర వోపా సభ్యులు సింహారాజు కోదండరాములు, వోపా జిఆల్ల ప్రధాన కార్యదర్శి గజ్జెల హరిహరాచారి, బులియన్ మర్చంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వంగల రమేష్ పాల్గొన్నారు.

కుంకుమార్చనలు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 1: శ్రావణ మాస ముగింపు సందర్భంగా ఆదివారం మాండవ్య నదీతీరం, దేవుళ్ళపురి, శివభక్త మార్కండేయస్వామి దేవాలయంలో మహాలక్ష్మీదేవీ కుంకు మార్చనలు, సుమంగళీ పూజలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సంక్షేమ ట్రస్టు అధ్యక్షుడు చిలుక నరసప్ప, వినోద, ప్రసన్న, కవిత, సంధ్య, మంజుల, రమ, సునిత, సావిత్రి, లోకేందర్, తిరుపతి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రెండు పంపుల ద్వారా నీటి విడుదల

రామడుగు, సెప్టెంబరు1: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయా నికి నీటి విడుదల కొనసాగుతుంది. ఆదివారం రెండు పంపుల ద్వారా 6300 క్యూసెక్కుల నీటిని ఎస్ఆర్ఆర్ డ్యామ్‌కు తరలించారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్‌హౌస్ నుంచి రాజేశ్వర జలాశయానికి 25 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు.